
# చిరిగిన తెరచాప




అద్దంలాంటి నున్నటి పాలిష్డ్ గచ్చు మీద కన్నీటి చుక్క పడి పగిలినట్టు ఒక్కసారి అక్కడి గుంపులో గోల పగిలింది. పే క్లర్క్ వచ్చాడు. పే క్లర్క్ వెనకాలే వో కర్రపెట్టె. దాని వెనకాల వో కాకీ బట్టల కాపలా మనిషి కూడా వచ్చారు.

ఆ గుంపులో చాలామందికి జీతం తీసుకోవటం కొత్తేం కాదు. జీతం రోజు ఆ హడావుడి, వొకరి మీద వొకరు ఎగబడే యిబ్బంది కొత్త కావు.

అలవాటైన ఇబ్బందితో, అలవాటైన ఆ గుంపులో నగిలిపోతూ నిలబడ్డాడు సత్యం.

అందాల్సిన జీతం అందకుండా ఎక్కడికీ పోదని అందరికీ తెలుసు. అయినా ఆదుర్దా.... ఒక్కోరికీ ఒకో రకం.

కాబూలీవాడు వచ్చాడేమోనని వెతికే కళ్ళు కొన్ని, వడ్డీ వ్యాపారస్థుల స్కూటర్ చప్పుడు వినిపిస్తుందేమో అని భయపడే చెవులు కొన్ని, అదేరోజు పెళ్ళాలొచ్చి బలవంతంగా జీతం పట్టుకెడితేనే కాని ఇల్లు గడవని తాగుబోతుల గుండె చప్పుళ్ళు కొన్ని.

సత్యం గాలి కోసం, ఊపిరి అందటం కోసం కొద్దిగా మునికాళ్ళ మీద పైకి లేచాడు. నోట్ల చప్పుడు వినిపించింది. ముందున్న భుజాల మీంచి, తలల సందుల్లోంచి ఎర్రటి స్టాంపుల అంచులు కనిపించాయి. అలా నిలబట్టానికి చిరాగ్గా వుంది సత్యానికి. న్యాయానికి నెలంతా చేసిన కష్టానికి జీతం అందుకుంటున్నప్పుడు అలా వుండకూడదు. ఉద్యోగంలో చేరిన కొత్తలో అలా వుండేది కాదు. పోనీ అప్పుడు వుద్యోగం మోజులే అనుకుంటే, పెళ్ళయిన కొత్తలో కూడా అలా వుండేది కాదు.

జీతాల రోజంటే ఉత్సాహంగా వుండేది. నెలలోని మామూలు రోజులకన్నా వేరుగా వుండేది. ఏ సినిమా ప్రోగ్రామో, హోటలు భోజనమో, స్నేహితుల ఇంటిలో ఏదో రకమైన సరదానో వుండేది.

ఇప్పుడదేం లేదు పేడే అంటే వర్రీ.... బుర్రలో అనేక రకాలుగా మారిపోయే బడ్జెట్, వచ్చే జీతం ఖర్చులకి ఎలా సరిపెట్టాలా అన్న ఆలోచన, రోజూకన్నా చిరాకు, మెదడంతా కలయ తిరిగే రకరకాల గోల.

గుంపులో గోల పెరుగుతూనే వుంది.

ఆలోచిస్తున్న సత్యం డొక్కలో ఎవరిదో మోచెయ్యి తగిలింది. ఆలోచన ఆగిపోవటమే కాదు. దెబ్బ తగిలిన చోట నరాలు మొద్దెక్కినట్టయ్యాయి. ఆ చేతి తాలూకు రామనాథం వెనక్కి తిరిగి ఏదేదో అన్నాడు. బాధలో సత్యానికి తిన్నగా వినపళ్ళేదు.

వంగిన సత్యం తిన్నగా నిలబట్టానికి మరో నాలుగైదు నిముషాలు పట్టింది.

"ఏం జీతమో తీసుకునేవరకూ వో గొడవ, తీసుకున్నాక వో గొడవ" ఎవరిదో గొంతు...

'అవును తీసుకున్నాక వో గొడవ' అనుకున్నాడు సత్యం.

ఆఫీసులో అప్పులాళ్ళని తప్పించుకోవాలి. ఆఫీసు బైట చందాలవాళ్ళని, బస్‌స్టాప్‌లో జేబుదొంగల్ని తప్పించుకోవాలి. బతుకంతా తప్పించుకోవటంతోనే సరిపోయేలా వుంది.

ఉక్కపోతవల్ల ఎండ తక్కువగా వున్నా ఎక్కువగా వున్నట్టుంది.

అలవాటులేని రైతు తనఖా దస్తావేజు మీద సంతకం చెయ్యటానికి కంగారుగా కలం కదపటంలో పడిన సిరా చుక్కలా అక్కడ గుంపులో గోల మళ్ళీ పగిలింది. లోపల మిగిలున్న మరికొందరొచ్చారు జీతానికి.

రకరకాల మాటలు, రకరకాల చూపులు. ఓ అరగంటకి సత్యానికి జీతం అందింది. అందే ముందు ఆ విషయం గుర్తొచ్చి, ఆ నెల వస్తోన్న ఇరవై రూపాయల ఓవర్‌టైం గుర్తొచ్చి పిచ్చెక్కినంత, అంతవరకు వున్న చిరాకు చచ్చిపోయినంత ఆనందం కలిగింది.

ఓటి సంగతి పూర్తిగా మరిచిపోలేదు సత్యం. నిన్నటిదాకా గుర్తుంది. కానీ యీరోజే తొడతొక్కిడిలో మరిచిపోయాడు.

మరో రెండుగంటల తర్వాత చందాల రసీదుల్నించి, బస్‌స్టాండ్ యీవిల్స్ నుంచి తప్పించుకుని ఇంటికొస్తున్న సత్యానికి ఉత్సాహంగా వుంది. బతుకు పీలికలన్నీ కలగలిసి వాటంతట అవే అతుక్కుపోయి కళ్ళ ముందు తెల్లటి తెరచాపలా కదుల్తున్నట్టయింది. రాత్రిళ్ళు గుడ్డి వెలుగులో పడుకున్న తన పక్క

నించి తెరచాపలా లేచి నిలబడే భార్య జానకి గుర్తొచ్చింది.

"ఉట్టి పిచ్చి మొద్దు జానకి" అనుకున్నాడు సత్యం ఇల్లు పదిగజాల దూరంలో వుండగా.

★ ★ ★

ఆ పిచ్చిమొద్దుకి తెలుసు ఆరోజు సత్యానికి జీతం అందుతుందని. సత్యానికీ తెలుసు జీతం అందిందని. ఇంటి ఖర్చుల విషయం మాట్లాడుకోవాలని ఇద్దరికీ తెలుసు. అయినా భోజనాలు అయ్యేవరకు ఎవరూ ఆ సంగతి కదపలేదు.

భోజనం చేస్తుండగా వోసారి నోరు విప్పబోయి తటపటాయించి తెరిచిన నోరు మూసుకోలేక "కందిపచ్చడి బావుంది" అన్నాడు సత్యం.

అది విన్న జానకి ఏమంటానికీ తోచక నవ్వబోయింది. అన్నం తిన్న కంచాలు జానకి తీసేవరకు అటూ ఇటూ పచార్లు చేశాడు సత్యం.

పక్క లేయబోతూ, ఆరోజు తెచ్చిన సరుకుల సంచీలు వో పక్క నుంచి మరో పక్కకి సర్దింది జానకి. సమయం వచ్చాక కదలొచ్చులే అని బద్ధకంగా పడుకున్న కొండచిలువల్లా కనిపించాయి సత్యానికవి.

ఆరోజు జానకి నెలకి కావలసిన సరుకులన్నీ తెస్తుందని తెలుసు. నాలుగేళ్ళుగా అదే వీధిలో కాపరం వుంటున్నందువల్ల కొట్టువాడు ఒకటిరెండు రోజుల అప్పు యిస్తాడు.

"ఇక మొదలెట్టాలి" అనుకున్నాడు సత్యం.

"ఇక సిద్ధపడాలి" అనుకుంది పక్కవేసిన జానకి.

అనుకుని మూలున్న సంచిలోంచి తెల్లటి పొడుగాటి కాయితం తీసి సత్యానికిచ్చింది. కాయితం కన్నా ముందు కాయితం చివరి అంకె చూశాడు.

విసుగు, చిరాకు, అసహనం, కోపం, చేతకానితనం అన్నీ వొక్కసారిగా తన్నుకొస్తాయని తెలుసు సత్యానికి.

"నూట అరవై ఎయిందా" అన్నాడు. ఎంత తగ్గించాలనుకున్నా సత్యం గొంతు అరచినట్టే వుంది.

జానకి ఏం మాట్లాడలేదు. నెమ్మదిగా తలూపింది. తప్పనిసరై నలుగుర్ని హత్య చేసిన ముద్దాయిలా తలొంచుకుని నిలబడింది.

"రోజు రోజుకీ నీకు వొళ్ళు తెలియటం లేదు. నీ యిష్టం వొచ్చినట్టు సరుకులిలా తెచ్చి తగలేస్తే......"

ఇంకా సత్యం మా ట పూర్తి కాకముందే అక్కణ్ణించి వంటింట్లోకి వెళ్ళిపోయింది జానకి.

నెలంతా కష్టపడి చేసిన ఇరవై రూపాయల ఓటిని మింగేసిన రాక్షసిలా వుంది సత్యం చేతిలో కాయితం.

పోపుల డబ్బాలోంచో.... పాత పుస్తకం మధ్యలోంచో ఏదో సంచిలోంచో.... ఎక్కణ్ణించి తీసిందో మరో తెల్లటి కాయితంతో సత్యం దగ్గరికొచ్చింది జానకి.

ఆ కాయితం చూడగానే "నీ వెధవలెక్కలేం అఖ్ఖర్లేదు...." అని తిట్టబోయాడు సత్యం.

"కిందటినెల లిస్టు.... కిందటి నెల ఏ సరుకెంత తెచ్చానో యీ నెలా అలాగే తెచ్చాను....

చూడండి...." అంది జానకి.

తన కోపాన్ని బలవంతంగా మింగాడు సత్యం రెండు కాయితాల్లో సరుకులొకటే.... రేట్లే పెరిగాయి.

రెండు కాయితాలు చూశాక సత్యం కోపం పూర్తిగా చచ్చిపోయినా ఏడుపు చావలేదు. ఎవర్ని తిట్టాలో అర్థం కాలేదు. నెమ్మదిగా పక్కవేపు నడిచాడు.

అంతకుముందు తిన్న కందిపచ్చడితోపాటు మరేదో కలగలసి కడుపులో తిరుగుతున్నట్టుంది పడుకున్న సత్యానికి. నిష్కారణంగా భార్యని తిట్టానన్న బాధ తెలుస్తోంది. కళ్ళు మూసుకోగానే క్రమేపీ ఆలోచనలో అక్కసు చోటు చేసుకోవటం మొదలెట్టింది.

కరువైపోతున్న జీవితావసరాల మీద... కఱ్ఱ పెట్టెలమీద... నోట్లు లెక్కపెట్టే వేళ్ళ మీద... వడ్డీలతోడేళ్ళ మీద... బొఱ్ఱ బొజ్జలమీద... తెల్ల కాయితం పాముల మీద... చివరికి చాతకాని తన బతుకు మీద అక్కసు.

మనసులో ఏదో తెలియని యిరుకు... యిబ్బంది... కాస్సేపైనా కదలకుండా పడుకోలేకపోయాడు సత్యం, పక్కకి తిరిగాడు.

అపుడే వంటిల్లు సద్దేసొచ్చి చెంగుకి చెయ్యి తుడుచుకుంటూ నిలబడ్డ జానకి కనపడింది. జానక్కి వెనగ్గావున్న లైటు వెలుగు సత్యం కళ్ళల్లో పొడిచింది.

పడుకోబోతున్న జానకితో... "లైటార్పేయకూడదు..." అన్నాడు సత్యం. బతుకులోని భయంకర నిజాలకి ప్రతినిధిలా కనపడుతోంది లైటు. కాస్త పక్కకు జరిగి జానక్కి చోటిచ్చాడు సత్యం.

ఇద్దరికీ యిబ్బందిగా వుంది... బాధగా వుంది. వోదార్పు కావాలనుంది.

"ఉత్తరాలేమేనా వచ్చాయా...." అన్నాడు సత్యం నెమ్మదిగా.

"రాలేదు..." అంది జానకి అంతకన్నా నెమ్మదిగా. సత్యం చెల్లెలు, తల్లీ, మేనమామ యింటికెళ్ళారు ఏదో పెళ్ళికని, వాళ్ళతోపాటే తీసికెళ్ళారు మూడేళ్ల కొడుకుని కూడా.

వంటింట్లోంచి కిరసనాయిలు దీపం పల్చటి కాంతి గుమ్మందాటి ఆ గదిలోకి కొంతవరకూ వచ్చి ఆగిపోయింది.

"ఈనెల ఇరవైరూపాయలు ఓ.టి. కూడా వచ్చింది. అది కూడా యిలా సరుకుల్లో పడిపోయినందుకు..." అన్నాడు సత్యం.

నాకు తెలుసునన్నట్టు దగ్గరకు జరిగింది జానకి.

"మూడు నెలల్నించీ నువ్వడుగుతున్నది అస్తమానం గుర్తొస్తూనే వుంది" అన్నాడు తిరిగి సత్యం.

"పోనీలెండి ఏం చేస్తాం... పై నెల యిద్దురుగాని.... మరీ అంత సర్దుకుపోలేంది కాదుగా అంది.వెన్నెలలా వినపడ్డాయి సత్యానికా మాటలు. చుట్టూ వున్న చీకటి చల్లగా, మంచు తడిసిన పువ్వులా వున్నట్టనిపించింది.

జానకిని.... వోదార్పుని మరింత దగ్గరగా గుండెల్లోకి పొదువుకున్నాడు సత్యం కొద్దిగా తడిసిన జానకి చీర కొంగు సత్యం మెడకింద చల్లగా తగిలింది. ఆ చల్లటి వోదార్పుకి సత్యం వొంట్లో ప్రతి అణువు వొణికింది.

జంతువులా కమ్మే కోరికతో కాకుండా, బాధ సడలుతున్న అనుభూతితో నెమ్మదిగా కదిలాడు

సత్యం... జానకీ కదిలింది.

సత్యం వేళ్ళు నడుం మీద తారట్లాడుతుంటే "ఒక్క నిముషం వుండండి..." అంది జానకి - తన మాట పూర్తి కాకుండానే అర్థమైంది సత్యానికి. జానకి అడక్కుండానే వొదిలేసి దూరంగా జరిగాడు.

భార్య పాదాల్తోపాటు తెల్లటి లంగా అంచులు కూడా కనపడ్డాయి సత్యానికి. ఆ గదిలో వున్న కాస్త గుడ్డి వెలుగులో కూడా స్పష్టంగా కనపడ్డాయి సత్యానికి... చూడకూడదనుకుంటూనే చూశాడు పీలికలైపోయిన ఆ లంగా అంచుల్ని.... మరి కొంచం పైగా వున్న ఆ తెల్లటి తెరచాపలోని చిరుగుల్ని....

"అసలే చిరిగిపోయింది.... మన హడావిడిలో మరింత చిరిగిపోతుందని...." అంది జానకి నెమ్మదిగా నవ్వుతూ.... అందమైన జానకి ముఖానికి చిరుగులా వున్న ఆ నవ్వుని కూడా చూశాడు సత్యం.

భార్యకున్నవి రెండు లంగాలే అని.... అందులో వొకటి ఈ స్థితికి రాబోతోందని మూడునెలల క్రితమే తెలుసు సత్యానికి. మూడు నెలలుగా ప్రతి జీతంరోజు జానకి గుర్తు చేస్తూనే వుంది వాటి సంగతి.

'తేలిగ్గా తీసుకోవాలి.... సర్దుకుపోవాలి....' అంటూ గొణుక్కోబోయాడు. మరోసారి నిజాన్ని మరిచిపోవటానికి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు సత్యం. కళ్ళముందు చిరుగుల తెరచాప కదిలింది. 'బతుకు గడవటం లేదు.... గాలికి కొట్టుకుపోతోంది....' అనుకున్నాడు.

తనలోని బాధకి కారణమేమిటో తెలుస్తోంది సత్యానికి.

రోజురోజుకి పెరిగిపోతున్న రేట్లు, ఇరుకైపోతున్న బతుకు కళ్ళముందు కదలటం మానలేదు. కానీ ఏం చెయ్యాలో తోచలేదు. పగలైతే చాలామంది లోయర్ మిడిల్ క్లాస్ బ్రదర్స్‌లా చిరాకు పడేవాడు.... ఎవర్నో వొకర్ని ఏదో వంకతో తిట్టేవాడు. రాత్రి కాబట్టి, ఏదో రకమైన వోదార్పు తోడుంది కాబట్టి, మర్నాడు లేచి మళ్ళీ వూపిరున్న మనిషిలా తిరగాలి కాబట్టి, గుండెలో ఏడుపుని ఖూనీ చేసుకుంటూ జానక్కి మరింత దగ్గరగా జరిగాడు సత్యం.

• *జీవనాడి మాసపత్రిక ప్రత్యేక సంచిక, ఆగస్టు, 1974*
• *పునర్ముద్రణ - పల్లకి సచిత్ర వారపత్రిక, జూన్ 4, 1987*